
# వాన కురిసిన వో మధ్యాహ్నం...



మబ్బులు కమ్ముకొంటోన్న ఆకాశం వైపు దిగులుగా చూస్తున్న దేశికతో, "నీకో రెండు బుల్లి విమానాల్ని యిస్తా. మీ అపార్ట్‌మెంట్ టెర్రస్‌పై వుంచుకో. మేఘాలు రాగానే వాటిని యీ విమానాలతో తోలుకుంటూ వెళ్ళు...

మొన్న చైనా వొలింపిక్స్‌లో వర్షం పడకుండా వాళ్ళు అలానే చేసారంట," యాపిల్ పళ్ళులా మిలమిలలాడుతోన్న ఆమె బుగ్గలపై తన రెండు చేతులతో చిట్టి ముద్దులు పెడుతూ అన్నాడు అనిరుధ్.

"నిజంగానా... యెప్పుడిస్తావ్," ఆత్రంగా అడిగింది దేశిక.

"రిక్విజేషన్ పంపా," సీరియస్‌గా అన్నాడు.

"యెవరికి"

"విజయమల్యాకి," తిరిగి అంతే సీరియస్‌గా చెప్పాడు.

"స్టుపిడ్... నీకంతా జోక్సే... వర్షం వాసనంటేనే భయమేస్తోంది."

సెల్‌ఫోన్‌లో టైమ్ చూస్తూ, "త్వరగా తిను. అప్పుడే రెండవుతోంది. క్లాస్ స్టార్ట్ అవుతుంది..." అంటూ త్వరత్వరగా పీజా పీస్‌ని టమేటోసాస్‌లో అద్ది తింటూ, "పోనీ క్లాస్‌కి వెళ్ళకుండా యింటికి వెళ్ళిపోదామా... వర్షం కురిస్తే రోడ్స్ అన్నీ మునిగిపోతాయి. ఆ రోడ్లపై వేలాడాలి," అంది.

"వో గాడ్... స్టుపిట్ దేశి. వర్షం మీదెంతో రొమాంటిక్ కవితలు రాసే దేశిక యిలా మాట్లాడుతుందంటే నవ్వుతారు. సమస్య వుంటే పరిష్కరించుకోవాలి కానీ యిలా భయపడితే యెలా. యేదీ వో కవిత చెప్పు," ఆమెని యీజ్ చేయటానికి అడిగాడు అనిరుధ్.

"కవితా... వర్షమొస్తే కవిత్వం రావట్లేదిప్పుడు. యం.సి.హెచ్., పోలీస్, పవర్ వాళ్ళ యెమర్జెన్సీ నెంబర్లే మెదుల్తున్నాయి. అసలు నీకేం... మీ యిల్లేమో యెంచక్కా గేటెడ్ కమ్యూనిటీలాంటి ప్లేస్‌లో వుంది. యిండిపెండెంట్ హౌస్. మాదేమో పదేళ్ళనాటి అపార్ట్‌మెంట్. పైగా మిడిల్ క్లాస్," విసుగ్గా చేతుల్ని పేపర్ పేప్‌కిన్‌కి తుడుచుకొంటూ అంది దేశిక.

ఆమె మాటలకి అతను ఫకాల్న నవ్వాడు. తింటున్న పిజా గొంతుక్కి అడ్డంపడి పొలమారింది. ఆ టెర్రస్ క్యాంటీన్‌లో అక్కడక్కడా కూర్చుని లంచ్ చేస్తున్న స్టూడెంట్స్ తిరిగి చూసారు. కోక్ తాగి వాళ్ళవైపు చూసి, 'యెక్స్‌క్యూజ్‌మి,' అని చెప్పి దేశిక వైపు చూస్తూ, "మా యింటికేం అనికదా అంటున్నావ్. కొత్తగా డెవలప్ అవుతోన్న సిటీ అని కదా మా డాడీ సైబరాబాద్ వైపు లేఅవుట్‌లో స్థలం కొని

యిల్లు కట్టారా. యిప్పుడా యిల్లు మార్కెట్‌రేట్‌లో మూడుకోట్లు వుంటుందా. మా పాట్లు యేం చెప్పమంటావ్. వానలు కురవటం మొదలుకాగానే మా సెల్లార్‌లోకి బుసబుసలాడుతూ నీల్ళు వచ్చేస్తుండేవి. వెంటనే ఆ నీళ్ళని మోటరు పెట్టించి తోడించటం. వానాకాలమంతా యిదే కాలక్షేపం. యిలా యెందుకవుతుందాని యింట్లో అంతా వాపోతుంటే వో రోజు కూరలమ్మే తాత, 'యివన్నీ వొకప్పుడు పంటపొలాలు. రైతుల్నుంచి కొనుక్కొని లేఅవుట్‌లు చేసి మీ అందరికీ అమ్మారు. నా తోట కూడా యిందులోనే వుండేది. మీరుంటున్న యిల్లు మోటబావి. అతను కొంత మట్టితో కప్పి మీకు అమ్మాడు. మీరు పూర్తిగా పూడ్చకుండా అది సెల్లార్‌గా వుంచి పైకి లేపి యిల్లు కట్టారు. జల వూరదా మరి,' అని అసలు సంగతి చెప్పాడు. మోటబావి అని చెప్పకుండా ఆ స్థలాన్ని అమ్మిన డెవలపర్ మీద కేస్ పెట్టాలా వద్దాని వర్షాకాలమంతా చర్చలు జరుగుతూనే వుంటాయి మా యింట్లో. నడు క్లాస్‌కి. సగం క్లాస్ అయిపోయి వుంటుంది యీ పాటికి," అన్నాడు అనిరుధ్.

"వర్షం పెద్దగా పడేట్టే వుంది... వొక్క నిమిషం అమ్మకి ఫోన్ చేస్తా. యింట్లో పరిస్థితి యెలా వుందో," అంటూ దేశిక తల్లికి కాల్ చేసింది.

యింట్లో బట్టలు బీరువాలో సర్దుతూ, "టైమ్ యెంతయింది బాబాయ్," అడిగింది మేఘమాల.

"యిప్పుడు నీకు టైమ్ సంగతెందుకమ్మలూ. ఆ పనేదో పూర్తిచేయి."

దేనికీ తిన్నగా జవాబు చెప్పే అలవాటు రాలేదే అవతారం బాబాయ్‌కి అని మనసులోనే ముద్దుగా విసుక్కుంటూ, "ఝాన్సీ వస్తుంది బాబాయ్," అంది మేఘమాల.

పట్టుపంచెలకి కర్పూరపు వుండలని పెడుతున్న అవతారం ఆ పనాపి, "ఝాన్సీ యెవరమ్మాయి. నీకు అలాంటి స్నేహితులు చిన్నప్పుడెవరూ మన వూర్లో లేరు. బంధువుల్లోనూ లేరు. యిక్కడికొచ్చాక పరిచయమా," అన్నారు.

"బాబాయ్... అదో టి.వి. సీరియల్," నవ్వుతూ అంది మేఘమాల.

"టి.వి. సీరియలా... మీ పిన్ని యెప్పుడూ ఆ టి.వి.కే అతుక్కుపోతుంది యెప్పుడూ..."

“వుండు బాబాయ్, దేశిక ఫోన్ చేస్తోంది,” అంది మేఘమాల.

“వాన బాగా వచ్చేట్టుంది. అక్కడెలా వుంది, ” అడిగింది దేశిక.

“వానా...” అంటూ వొక్క వుదుటున బాల్కనీలోకి వచ్చింది మేఘమాల.

“యేంటా దూకుడు,” అనుకుంటూ అవతారం కూడా బాల్కనీలోకి రాబోతుంటే, “యిక్కడ బానే వుంది. రాదేమో. వచ్చే దారంతా యెలా వుందో కనుక్కొని బయలుదేరు. దార్లో యిరుక్కోకు. అనిరుధ్‌కి చెప్పు తొందరపడ బయలుదేరొద్దని. చెల్లాయి కాలేజ్ దగ్గర యెలా వుందో... అన్నగాడికి ఫోన్ చేశావా,” అడిగింది మేఘమాల.

“లేదమ్మా. క్లాస్‌లోకి వెళుతున్నా. నువ్వు చేయి,” అంది దేశిక. మేఘమాల ప్రాచికి మెసేజ్ పెట్టింది. ‘డోన్ట్ వర్రీ,’ అని జవాబు వచ్చింది. ‘బ్రహ్మాండం మీద పడినా డోన్ట్ వర్రీ తప్ప మరేం అనదు,’ అని చిన్న కూతుర్ని విసుక్కుంటూ జయదేవ్‌కి ఫోన్ చేసింది.

“అక్కడేమైనా వర్షం వస్తుందా,” అడిగింది.

“అమ్మా... కాస్త మబ్బేసిందంతే. క్లాస్‌లో వున్నా. మళ్ళీ మాట్లాడతా. మీరంతా జాగ్రత్త,” గుసగుసగా చెప్పాడు జయదేవ్.

యిదంతా చూస్తున్న అవతారం అయోమయంగా, “అమ్మలూ యేమయింది అలా కంగారుపడుతున్నావ్,” అని అడిగారు.

తన పెళ్ళయి పిల్లలు పెద్దాళ్ళయిన యిన్నాళ్ళకి వూరు వదిలి వచ్చిన అవతారం బాబాయ్‌ని బెంబేలు యెత్తించటం యెందుకులేనని, “మా సెల్‌ఫోన్స్ అన్నీ లైఫ్‌టైం ఫ్రీ టాకింగ్‌లో వున్నాయి బాబాయ్. అందుకని యెప్పుడూ యిలా లైన్‌లో మాట్లాడుకుంటూనే వుంటాం,” నవ్వుతూ అంది మేఘమాల.

“టి.వి. పెడదాం బాబాయ్. ఝాన్సీ వచ్చే టైమ్ అయింది,” అంటూ టి.వి. ఆన్ చేసింది.

న్యూస్‌ఛానెల్లో బ్రేకింగ్ న్యూస్ అంటూ హైదరాబాద్‌లో భారీవర్షం, ట్రాఫిక్ జామ్ అని టపటప కనిపించగానే, “యిదేంటి అమ్మలూ, మనం వుంటుంది

హైదరాబాదేగా. అందులోనూ హార్ట్ ఆఫ్ ది సిటి అని కూడా చెప్పావ్. యిక్కడ వానలేదు కదా," అన్నారు అవతారం.

"వొకచోట పడితే మరోచోట పడదు బాబాయ్ యిక్కడ. వొక్కోసారి సిటి అంతా కురుస్తుందనుకో," అని మేఘమాల అంటుండగానే మధ్యాహ్నం పనికి వచ్చిన జయ, "అప్పుడు వరదలే," అంది.

"యిదేం చోద్యం... పారే నది లేదు. పెద్దపెద్ద చెరువులు లేవ్ కాలవలు లేవ్... కానీ యిక్కడ వరదలంటారు," ఆశ్చర్యంగా అన్నాడు అవతారం.

"అవన్నీ వుంటే వరదలే వచ్చేవి కావేమో. వాటన్నిటినీ పూడ్చిపూడ్చి బిల్డింగులే బిల్డింగులు. మురికినీరు, వర్షంనీరు పోయే తూములు కూడా మూసేసి బిల్డింగులు కట్టారంట. యిప్పుడా నీరు యెటుపోద్ది. బిల్డింగులు, ఫ్లైవోవర్లు, వంతెనలు కట్టినప్పుడు నీరు పోయే సౌకర్యమేదీ సరిగ్గా పెట్టలేదంట. యెటుపోద్ది నీరు యిళ్ళల్లోకి రాక, అంటున్నాడు మా మావ," యిల్లు చిమ్ముతూ అంది జయ.

'అబ్బా, యీ బాబాయ్‌కు తోడు యిప్పుడీ జయ. యిద్దరికి యిద్దరే. అలా మాట్లాడుతూనే వుంటారు,' అనుకుంటూ ఝూన్సీ పెట్టింది మేఘమాల.

కమర్షియల్ బ్రేక్ రాగానే బయటికొచ్చి ఆకాశం వైపు చూసింది. యింతకు ముందు కంటె తగ్గిన పగటి వెలుతురు. 'ప్చ్! బాబా వాన రాకుండా చూడండి,' అనుకుంటూ హాల్లోకి వచ్చింది మేఘమాల.

"మేం మా వూర్లో విరాటపర్వాన్ని తోలుబొమ్మలాట ఆడిస్తాం వానలు కురవాలని. మా అన్నయ్య అదే మీ నాన్నగారు విరాటపర్వాన్ని వూరందరి ముందు కూర్చుని పఠించేవారు. వో నాలుగైదు రోజులకి వానలు కురిసేవి. నీకప్పుడు వానంటే యెంతిష్టం. తడిసి ముద్దయ్యేదానివి. మా వదినగారు చిట్టివడలు, పునుకులు, పకోడీలు వేడివేడిగా వాయిలు తీసి యిస్తుంటే యింటిల్లిపాది ఆవిడ చుట్టూ పోగయ్యేవారం," అవతారం చెపుతుంటే ఆగలేక, "మా వూర్లో వానలు పడితే పండగే పండగ," అని జయ మొదలుపెట్టగానే, "మడతలు పెట్టింది చాలుగానీ వాటిని బీరువాలో పెట్టి కాసిన్ని వుల్లిపాయలు కట్ చేయి. ప్రాచి వచ్చే టైమ్ అయింది," అంది మేఘమాల.

వుల్లిపాయలు కట్ చేసి తుక్కుని బుట్టలో పోయటానికి వంటింటి బాల్కనీలోకి వచ్చిన జయ ఆకాశంవైపు చూసింది. యెండ పోతూ తెల్లని మేఘాలు మరింత నల్లబడుతున్నాయ్.

"అమ్మో వాన దిగేట్టుంది," అనుకొంటూ ఆదరాబాదరాగా యింట్లోకి వచ్చి, "అమ్మా మిగిలిన పని వాన వెలిసాక చేస్తా. యింట్లో సామాన్లన్నీ యెత్తి పెట్టు కోవాలి. వరద వచ్చేస్తాది," అంటూ వొక్క పరుగు తీసింది.

అప్పుడే కాలేజ్ నుంచి వచ్చిన ప్రాచిని చూస్తూ, "హమ్మయ్య వచ్చేసావా... బట్టలు మార్చుకుని రా. టిఫిన్ చేస్తున్నా. వేడిగా తిందువు," అంది మేఘమాల.

సెల్‌ఫోన్‌లో స్నేహితులతో మాట్లాడుతూ యెసెమ్మెస్‌లు పంపిస్తూ వచ్చినవి చూస్తున్న ప్రాచికి దృష్టి యిక్కడ లేదసలు. ఛాటింగ్ మీదో ఫోన్ మీదోనే దృష్టంతా.

"యీ పిల్లకి యేం పట్టదు," విసుక్కుంటూ టిఫిన్ చేయడానికి వెళ్ళింది.

యింతలో టపటపా చినుకులు. చూస్తుండగానే ధార.

మేఘమాల సెల్‌ఫోన్ తీసుకొని, 'మల్లేశం వాన వచ్చేస్తుంది. మేన్‌హోల్స్ యెత్తి పెట్టండి. అక్కడ యెర్రబట్ట కట్టిన గెడకర్రని నిలబెట్టటం మర్చిపోకండి. వచ్చేపోయేవాళ్ళని చూసి మాన్‌హోల్స్ యెత్తున్నాయని చెప్పండి," అంటూ త్వరత్వరగా హెచ్చరికలు జారీ చేసింది.

అలానే అప్పలకొండ, యాదగిరి, రాంబాబులకు చకచకా అదే విషయాన్ని చెప్పింది. యింతలో జయ బిలబిలమంటూ అత్తాపిల్లలతో మేఘమాల యింటి కొచ్చింది.

"కరెంట్ ఆపు," అంది మేఘమాల.

"ఆ స్విచ్ యిరిగిపోయిందమ్మా, కటింగ్ ప్లేయర్ కావాలి," కంగారుగా అడిగాడు వెనకే వచ్చిన జయ మొగుడు జగన్నాథం.

"యేం మెయిన్‌టెన్స్ చేస్తాడో. వో కటింగ్ ప్లేయర్ టార్చీ యేమీ వుండవ్. అన్నీ మనమే యివ్వాలి," మేఘమాల అతనికి కటింగ్ ప్లేయర్ యిస్తూ కోపంగా అంది.

"యేం పిల్లవమ్మా. యెప్పుడూ ఆ ఫోనే. తీసి బయటికి విసిరేస్తాను. లేచి కాస్త ఆ కిటికి తలుపులు వేయి," వొక్క అరుపు అరిచింది మేఘమాల.

'వొక్కరవ్వ గట్టిగా మాట్లాడితే రెండో మనిషికి యెక్కడ వినిపిస్తుందోనని మొహమాటంగా మాట్లాడే అమ్మలేనా యింత కంచుకంఠంతో అరుస్తోంది," అని పైకి అనబోయి యిది సమయం కాదని గ్రహించి అవతారంగారు గొంతులో మాటలు గొంతులోనే కుక్కేసుకున్నారు.

"యీ పవర్ వాళ్ళ నెంబర్ యిక్కడే రాసుంచాను. కనిపించటం లేదు. ప్రాచీ ఆ ఫోన్ వదులు. కరెంటోళ్ళ ఫోన్ నెంబర్ చూడు. అర్జెంట్," తిరిగి గట్టిగా అరిచింది.

ప్రాచి అరంగుళమైనా కదలకుండా తన బిజీలో తనుంది.

యింతలో యెదుటి అపార్ట్‌మెంట్ లోపలికి నీళ్ళొస్తున్నాయని అరుపులు. గోల. లిఫ్ట్ ఆపండి. నీళ్ళు పోతున్నాయ్. షాక్ కొట్టేస్తాది. అరే కార్ల లోపలికి నీళ్ళు పోతున్నాయి. పవర్ ఆపారా... మ్యాన్‌హోల్స్ మొత్తం మూతలు తీయండి అంటూ ఆ వీథిలోని మూడు అపార్ట్‌మెంట్స్ వాళ్ళు, రెండు యిండిపెండెంట్ యిళ్ళలోని ఆడవాళ్ళు, వాచ్‌మెన్, వాళ్ళ భార్యాపిల్లలు అరుపులు, హడావుడి.

"యిళ్ళల్లోకి నీళ్ళొచ్చేస్తున్నాయి. మంచం బోర్లించి రేషన్ పైకి పెట్టండి," వంటగదికి యిటు పక్కనున్న చిన్న స్లమ్ నుంచి కేకలు.

"యీ పిల్లకి యెన్నిసార్లు చెప్పినా వినదే. అమ్మా తల్లీ... అక్కకి ఫోన్ చేయి, యెక్కడుందో కనుక్కో," అంటూ ప్రాచికి అరచి చెప్పి, "పోయినసారి యిలానే 8 సెం.మీ. వర్షం వొక్కసారి దబదబా కురిసింది. దేశిక నాలుగు గంటలు ట్రాఫిక్ నీళ్ళల్లో యిరుక్కుపోయింది బాబాయ్," అవతారానికి చెప్పింది మేఘమాల.

వున్న వూళ్ళో వానొచ్చినా యెండొచ్చినా పురుగొచ్చినా పుట్రొచ్చినా చిన్నతనం నుంచి అలవాటైపోయిన రక్షణ మార్గాలేవో వుంటాయి. పుట్టి బుద్ధెరిగాక యింత పెద్ద నగరానికి మొదటిసారి రావటం యేంటో, అందులో యీ వానాకాలంలో రావటం యేంటో యీ వానలో యేదో శత్రుదండు దండెత్తినట్టు యింతమంది నీళ్ళని మేనేజ్ చేయటానికి పోరాడటం యేమిటో అని అసలిదంతా యేమిటో తనలో తను అనుకొంటూ అవతారం ఆఖరి మాటలు పైకి అనేసారు.

అప్పటికే బాబాని యీ వానని ఆపమని వేడుకొంటున్న మేఘమాల, "యేం చెప్పమంటావ్ బాబాయ్. విరాటపర్వపు తోలుబొమ్మలాట కోసం కళ్ళింత చేసుకొనే నేను యిప్పుడు వానొద్దని బాబాని వేడుకుంటున్నాను. వానొచ్చిన ప్రతిసారి గత రెండేళ్ళ నుంచి యిదే వరస. యీ కాలనీ మొదలే లో యేరియా. అప్పుడిన్ని అపార్ట్‌మెంట్స్ లేవు. యిన్ని షాపులు లేవు. యెంత నీరొచ్చినా పారే అవకాశం వుండేది. యిప్పుడు యెటు చూసినా అపార్ట్‌మెంట్స్. షాపులు. యెక్కడికక్కడ గోడలు, ఆక్రమణలు. మురికినీరు, వర్షంనీరు పోవడానికి వొకటే సిస్టమ్. నీళ్ళు యెటు పోతాయి? పోనీ వాటినైనా సరిగా తుక్కు లేకుండా చూస్తారా అంటే అదీ లేదు. మాన్‌హోల్ మూతలు యెత్తకపోతే ఆ మాత్రమైనా నీరు పోదు. తీస్తే మరీ ప్రమాదం. యీ వీధి వరకూ మేం వాటిని తీసిన ప్రతిసారి జాగ్రత్తలు తీసుకుంటూనే వున్నాం. షార్ట్‌సర్క్యూట్ సమస్య. ఆ మీటర్లు మునిగి పోకుండా పైకి మార్పిద్దాం అంటే యిక్కడ మెయిటెనెన్స్ చేసే అతను వొప్పుకోడు. యీ యేరియాలో వోనర్ల కంటే అద్దెకున్నవాళ్ళే యెక్కువ. వాళ్ళలో కూడా చాలామంది ఐటి బిపివోస్‌కి అద్దెకి యిచ్చారు. వాళ్ళలో చాలామంది ముగ్గురు నలుగురు కలిసి వుంటున్నవాళ్ళు. కొందరు ఫ్యామిలీస్ వాళ్ళూ వున్నారు. మేమంతా యిలా తంటాలు పడుతుంటాం," అంది మేఘమాల.

యింతలో ఫోన్.

"బిగ్‌బజార్‌కి సామానుకోసం వచ్చానండి. ఆటోలో గంట నుంచి వున్నాను. ఆటో లోకి నీళ్ళొచ్చేసాయి. పాప స్కూల్ నుంచి యింటికి వచ్చిందో లేదోనని. నీళ్ళొచ్చా యాండి," యెదుటి అపార్ట్‌మెంట్‌లో వుండే ఆమె అడుగుతోంది. యీ పదేళ్ళలో యిది రెండోసారి ఆవిడ మేఘమాలతో మాట్లాడటం. రెండుసార్లూ యీ వర్షపు నీటి గొడవలోనే.

కింద వచ్చిన నీరు యెలక్ట్రిక్ ప్యానల్స్ వైపు వెళ్ళకుండా ప్రతి అపార్ట్‌మెంట్ వాళ్ళు నానా తిప్పలు పడుతున్నారు. సాయంత్రం ఆరవుతుంటే రెండు గంటలు రోడ్డు మీద తడిచి ముద్దయ్యాక దేశిక యింటికి చేరింది. అప్పటికి వాన వెలిసింది.

వో గంట తర్వాత పవర్ ఆన్ చేసారు. స్లమ్‌లో వాళ్ళు, వాచ్‌మెన్ ఫ్యామిలీస్ యిళ్ళలో నీళ్ళని బయటికి తోడుకుంటున్నారు.

"అన్నం వండే వోపిక లేదు. చేతులు గుంజుతున్నాయి. పై యింట్లోని అమ్మని అడిగి యేమైనా తీసుకొస్తా," అని జయ జగన్నాథంతో చెప్పి వెళ్ళింది.

వెళ్ళిన జయ తొమ్మిదవుతున్నా రాలేదేంటాని జగన్నాథం మేఘమాల యింటికి వచ్చాడు.

జయ కళ్ళు అప్పగించి మొగలిరేకులు చూస్తోంది. మేఘమాల కూడా ఆ సీరియల్లో లీనమైపోయింది.

అది అయ్యాక వస్తుందిలే అనుకొంటూ కారిడార్‌లోకి వచ్చి ఆకాశం వైపు చూసాడు.

మబ్బులు లేవ్. చిన్నచిన్న తారలు.

రాత్రికి వాన రాదేమో యింక. మ్యాన్‌హోల్స్‌ని సగం కప్పెట్టేస్తే మంచిది అను కున్నాడు.

అప్పటికి వుద్యోగస్తులంతా యిళ్ళకి చేరారు.

భోజనాలు చేసారు. పదకొండు అవుతుండగా అప్పటికే వో నిద్ర తీసిన అవతారం లేచి హాల్లోకి వచ్చాడు. దేశిక ఫోన్‌లో యెవరితోనో మాట్లాడుతోంది. ప్రాచి కంప్యూటర్ ముందు, జయదేవ్ టి.వి. ముందున్నారు.

మేఘమాల వుదయం టిఫిన్ కోసం దోసెల పిండి కలుపుతోంది.

"అబ్బాయి యెప్పుడొస్తాడమ్మా," అడిగారు అవతారం.

"ఆయనకి యివాళ బాగా పొద్దుపోతుందంట. రేపు బయట దేశం నుంచి యెవరో వస్తున్నారంట. ఆ పనులు తెమల్లేదంట," అంది మేఘమాల.

పన్నెండవుతుంటే వొక్కొక్కరే పడుకున్నారు.

యిలా నిద్ర పట్టిందో లేదో దబదబా యేసిపై నీళ్ళు పడుతున్న చప్పుడు. మేఘమాల వొక్క వుదుటున లేచి బాల్కని తలుపు తీసింది. కుండపోతగా వాన. తిరిగి యధావిధిగా వీధి లేచింది. హడావుడి.

"అమ్మా," వొక్క అరుపు అరిచింది దేశిక.

"యేంటి."

ఆ అరుపుకి అవతారంగారికి యిప్పటివరకు లేని బి.పి. యేదో వచ్చినట్టయింది.

"వొక్కసారి కిందకి రా," వేగంగా పరిగెత్తింది దేశిక. మేఘమాల, జయదేవ్, అవతారం కిందకి త్వరత్వరగా వెళ్ళారు.

కింద కార్లు పడవల్లా తేల్తున్నాయి.

గుంపుగా వున్న వైపు చూసిన మేఘమాల కళ్ళు వొక్కసారిగా తెల్లబోయి తిరిగి విప్పార్చుకున్నాయి.

నీళ్ళు పోకుండా అడ్డుకొంటున్న వో లేఅవుట్ గోడని గునపంతో పదిహేనేళ్ళ సుకుమారమైన గులాబి వర్ణపు చేతులు పగలకొడుతున్నాయి.

సుశిక్షితురాలైన వైద్యురాలి చూపుల్లా టార్చిలైట్ వెలుతుర్లో మెరుస్తున్నాయ్ ప్రాచి కళ్ళు.

గోడలకి అయిన రంధ్రాల్లోంచి నీళ్ళు దొర్లాయి.

"అందుకోండ్రా గునపం. అక్కడో రంధ్రం చేద్దాం. యీ నీరూ పోతుంది," వాచ్‌మెన్‌లకి, స్లమ్‌లో పిల్లలకి వుత్సాహం వచ్చేసింది.

యెవ్వరూ చేయలేని పని ప్రాచి ఆరంభించినందుకు సంతోషిస్తూనే, 'గొడవల వుతాయేమో వాళ్ళంతా బాగా పరపతి వున్నవాళ్ళు," అంది మేఘమాల.

"యీ నీళ్ళు పోయే మార్గం చూడండని డిపార్ట్‌మెంట్స్ చుట్టూ, యీ వోనర్ల చుట్టూ బతిమాల్తూ తిరిగావ్ కద అమ్మలూ. యింక వాళ్ళే వస్తారు. యేదో వొక దారి చూస్తారు. అసలు మనూర్లో మనకి 15 కి.మీ. దూరంలో సముద్రం. కనుచూపు మేరలో నది. అయినా నేనెప్పుడూ యిలాంటి వరదల్ని చూడ లేదనుకో... యేదర్రా ఆ గునపం యిటివ్వండి కొట్టేద్దాం," వుత్సాహంగా అడిగారు అవతారం.

"యేం గొడవలవుతాయే," భయంగా మళ్ళీ అంది మేఘమాల.

"డోంట్ వర్రీ," అంటూ మరోవైపు గోడకి రంధ్రం చేసే పనిలో వుంది ప్రాచి.

దేశిక యిదంతా అనిరుధ్‌కి ఫోన్‌లో చెప్పేస్తోంది.

"యేంట్రా అర్ధరాత్రి పూట ఆ మాటలు," అడిగారు అనిరుధ్‌ని వాళ్ళ నాన్నగారు.

అనిరుధ్ చెప్పాడు.

"యీ సిటి వొకప్పటిలా వుండాలంటే యెక్కడి ఆక్రమణలను అక్కడే కొట్టేయాలేమో యిలానే... మన సిటిని మనం రైన్ ఫ్రెండ్లీ చేసుకోవాలిరా," అన్నారాయన.

"మన మోట బావి...'

"ఆలోచిస్తున్నా," అన్నారాయన.



*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*19 అక్టోబర్ 2008*